

# లేడీస్ నాట్ ఫర్ బర్నింగ్

రాయప్రోలు హైమ

**సరిగా** పన్నెండేళ్ళ క్రితం అనుకున్నా నా మాట—ఒక శ్రావణ పూర్ణిమ నాటి రాత్రి నా గదిలో కిటికీ వూచలు పట్టుకుని నిలబడి, దూరాన గాలికి తల లాడిస్తున్న కొబ్బరి చెట్లని చూస్తూ, ఆకాశంలో దట్టంగా మబ్బు లలుము కున్నాయి. ఈదురుగాలి రంయ్‌మంటూ చెవుల్లో దూరుతూంది. గుండెలో నుంచి వణుకు పుట్టు కొస్తూంది. ఆ రోజు పూర్ణిమే కాని అమా వాస్య కంటే ఎక్కువ చీకటిగా ఉంది బయట. పగలంతా వర్షం కురిసింది. కీచురాళ్ళు తెగ రొద చేస్తున్నాయి. ఏవేవో ఆలోచనలు, భయాలు నన్ను కలవరపెడు తున్నాయి.

ఎంత ఆలోచించినా, ఆ నాటి సాయంత్రం అప్రయత్నంగా నా చెవిని పడిన తల్లీ, కొడుకుల సంభాషణకి భాష్యం చెప్పుకోలేక పోతున్నాను. నేను తేవలసిన కట్నం బకాయి గురించే వాళ్ళు మాట్లాడుకుంటున్నా రనేది తథ్యం.

కాని, పాతిక వేల రూపాయలు ఎక్కణ్ణుంచి తెచ్చిస్తాడు అన్నయ్య, పాపం. అయినా ఒప్పుకున్న మొత్తం ఏభై వేల కరుకులు సమర్పించా కనేగా ఈయనగారు నా మెళ్ళో పుస్తె ముడేసింది. పోతే అలకపాన్పు మీద కోర్కెలు, స్కూటరు, ఫ్రిజ్, స్టీరియో సెట్.. వగైరా వగైరాలకి మింజువలె పాతిక వేల రూపాయల కాష్ కావాలిట.

"ఆ డబ్బిచ్చేకనే మీ అమ్మాయిని కాపురానికి తీసుకెళ్ళేది" అంటూ మూడు రాత్రుల ముచ్చట తీరక ముందే రుస రుస లాడుతూ నన్ను పుట్టింట్లో వదిలి వెళ్ళిపోయారు తల్లీ, కొడుకులు.

వదిన కంగారు పడిపోయింది. ఒక్కగా నొక్క చెల్లెలి పెళ్ళి ముచ్చట ఇలా అయినాయని అన్నయ్య బెంబేలు పడిపోయాడు కాని, ఏం చేస్తాడు! అప్పటి కప్పుడు పాతిక వేలు పుట్టించడ మంటే మాటలా? అప్పటికే అయిన చోటు, కాని చోటని లేకుండా అప్పులు చేసి, పంట అయిన కాడికి అమ్మేసి కట్నం డబ్బు సమకూర్చాడు. తాతలనాటి తరహా తీసి పోకుండా రంగ రంగ వైభవంగా పెళ్ళి జరిపించాడు. ఇక అలక పాన్పు కానుక లేగా... ప్రస్తుతానికి అరువేసి, కాలూ చెయ్యి కూడదీసుకుని ఇయ్యచ్చులే అనుకున్నాడు. పాపం ఖంగు తిన్నాడు.

పెళ్ళి పందిరింకా విప్పనే లేదు. ద్వారబంధాలకి కట్టిన మామిడాకుతోరణాలు అలాగే ఉన్నాయి. పెళ్ళి విందుల కోసం వంట వాళ్ళని పెట్టి వండించిన అరిసెలు, జిలేబీలు, లడ్డూలు నడవలో రాసులుగా పడి ఈగలు ముసురుతున్నాయి.

పెళ్ళిలో గొడవ లొచ్చాయి. చుట్టాలు పికాపికలై పోయారు. లేకపోతేనా? ఆ పదార్థా లన్నీ అయిపోయే దాకా మా ఇంట్లోనే తిష్ఠ వేసుకుని ఉండేవారు.

మళ్ళీ అప్పుల వేట ప్రారంభించాడు అన్నయ్య. లాభం లేకపోయింది. ఎలాగో కష్టపడి సొమ్ము సమకూర్చి, నన్ను అత్తారింటికి పంపాక తన తిప్పలు తను పడదాం అనుకున్నాడు. చెప్పు లరిగే లాగ పెద్ద పెద్ద షావుకార్ల వెనకాల పడి నెల్లాళ్ళ పాటు తిరిగాడు. మొత్తం డబ్బంతా ఒకరి దగ్గరే దొరక్క పోయినా, ముగ్గరు నలుగురు ఋణ దాతల నుంచి

కొంత కొంత అప్పు దొరికే సూచన కనిపించింది. ఇంతలో గోరుచుట్టు మీద రోకలి పోటు. లాండ్ మార్టిగేజి బాంకు నోటీసు. నాలుగేళ్ళ నుంచి మంచంలో ఉన్న అమ్మ చావు. దొరికిన డబ్బు దొరికినట్లే హరించుకుని పోయింది.

అమ్మ చనిపోయిన పదో రోజున ధర్మోదకాలు ఇవ్వడానికి కయినా అల్లుడు రాకపోతాడా.. వస్తే కాళ్ళు గడ్డం పట్టుకుని బతిమాలుదాం అని చూశాడు అన్నయ్య.

ఆ అందమయిన పర్సనాలిటీ. ఆ ఎమ్. బి. బి. ఎస్. డిగ్రీల వెనక అంతో ఇంతో మానవత్వం, సంస్కారం ఉంటుందనీ, తప్పక వస్తాడనీ ఆశగా ఎదురు చూశాను నేను కూడా. అలాగే ఆర్నెల్లు గడిచి పోయాయి అన్నయ్య నిట్టూర్పులు వదిన సూరడింపులు తమ్ముడి చికాకులు.

ఈ లోపున సవాలక్ష పుకార్లు బయలు దేరాయి— అతగాడు నన్నొదిలేసి వేరే పెళ్ళి చేసుకుంటాడని ఆ వూరి వాళ్ళెవరో మా వూరి వాళ్ళకి పక్క వూరి సంతలో కనిపించి చెప్పారట. అది అన్నయ్యకి తెలిసింది. కంగారు పడిపోయాడు. పడడూ మరి? ఏభై వేలు దూట బిళ్ళలు దోసిట్లో పోసి. మరో ఏభై వేలు ఖర్చుతో పెళ్ళి చేసి—వెరసి లక్ష పెట్టి కొనుక్కున్న బావ చెల్లాయి నొదిలేస్తాడంటే! కాని, డబ్బెక్కడా పుట్టడం లేదు.

"పోనీ ... అమ్మ నా కిచ్చిన ఇనూర్నరు కాసుల బంగారం అమ్మేసి వాళ్ళడిగిన పాతికవే లిచ్చేస్తే..." ధైర్యంచేసి అన్నయ్యతో అన్నాను.

"ఛ! ఆడపిల్ల సొమ్ము నా చేతకానితనానికి అడ్డుపెట్టుకుంటానా? ఆ నగలన్నీ అమ్మమ్మ అమ్మ కిచ్చింది. అమ్మ నీ కిచ్చింది. దానితో నీ కివ్వాల్సిన కట్నం చెల్లవేస్తే ఇక నా ప్రయోజకత్వం ఏముందని?"

ఫాల్స్ ప్రిస్టేజి ...

మరో ఆర్నెల్లు గడిచాయి. కథ ఎక్కడున్న దక్కడే ఉండిపోయింది.

ప్రతిరోజూ తెల్లవారుతోంది. పశ్చిమాద్రి ఎర్ర బడుతోంది. నా ఆశా కిరణాలు కాళరాత్రిలో కలిసిపోతూనే ఉన్నాయి. శ్రావణ మేఘాలు వెంవెల బోతూ వెళ్ళిపోయాయి. శారద రాత్రులు నా వేడి నిట్టూర్పుల గాడ్పులతో వాటి సహజ శీతలత్వాన్ని కోల్పోయి పరుగెట్టి పారిపోయాయి.

పెళ్ళివాడు లీలగా చూసిన అతడి అందమయిన మొహం ... అదీ నీటికుండలో ఉంగరంకోసం వెతికేటప్పుడు అరని చెయ్యి నా చేతిని బలంగా నొక్కగా కలిగిన ఆ అనుభూతి ... నాకు విశ్రాంతి లేకుండా చేశాయి. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. ఎంతో ఆలోచించాను. చివరికి ఒక నిర్ణయాని కొచ్చి వదినతో చెప్పాను.

"డబ్బులేకుండా ఏ మొహం పెట్టుకుని నిన్ను అత్తింటికి పంపను. పంపినా, వాళ్ళు ని న్నేలు కోక పోతే ..." అన్నయ్య శంకించాడు.

"ఏలుకుంటారు. అమ్మ నగలన్నీ నా కిస్తానని ముందుగా వాళ్ళతో ఒప్పందం చేసుకోలేదుగా! వాళ్ళ కివ్వాల్సిన పాతికవేల కంటే ఎక్కువ ఖరీదుచేసే వెండి బంగారాలు చూసి తప్పక శాంతిస్తారు."

అన్నయ్యకి నచ్చజెప్పేను.

లోపల్లోపల నా నమ్మకం ఏమిటంటే ... పసి నిమ్మకాయల మిసమిసలాడే రంగు, శిల్పంలాంటి అందం, యవ్వనంతో ఉన్న కుర్ర పెళ్ళాన్ని ఎదురుగా తిరుగుతూంటే అతను త్వరలోనే నా వైపు తిరుగుతాడని ...

చివరికి అన్నయ్య సరే నన్నాడు. "మా ఖర్మ ఏ రో జెలా ఉంటుందో, మ న్విక్కడే ఉంటే ... నీ నగలు కూడా మా ఆస్తితోపాటు అప్పుల రాక్షసుడు మింగేస్తాడేమో. నీ ఇంటికి నిన్ను చేర్చడమే మంచిది."

పంతులుగారు నిర్ణయించిన ముహూర్తాన యథావిధిగా చలిమిడి బిందెలు, పసుపు కుంకుమలు, కొత్త చీరలతో కాపురానికి బయల్దేరిన నన్ను కన్నీళ్ళతో సాగనంపింది వదిన.

మా అత్త మునలిది నన్ను, అన్నయ్యనీ వాకిట్లోనే తిట్టబోయింది. అన్నయ్య తెలివిగా టాక్సీ దిగుతూనే బ్రీఫ్‌కేస్‌లోంచి నా నగల దంతపు పెట్టె తీసి, తెరచి అరుగుమీద నిలబడ్డ మా అత్తముందుకి నడిచాడు.

"అత్తయ్యగారూ! పెళ్ళి సమయంలో మన ఒప్పందం మేరకు చెల్లాయికి మేం పెట్టిన 'బాల తొడుగు' ఇరవై కాసుల బంగారం కాక ... ఇవిగో ... ఈ నగలన్నీ మా అమ్మగారివి. నూరు కాసుల జవాహరీ. ఇంకా ఐదొందల తులాల వెండి, కంచాలూ గిన్నెలూ, సారె సామాన్లతో తీసుకొచ్చాను. కాస్త స్థిమితపడి అలక పాన్పు కానుకలు కూడా ఇచ్చేస్తాను. అమ్మాయిని స్వీకరించండి." గద్గదస్వరంతో అర్థించాడు.

దంతపు పెట్టెలో నగలు... కాసులపేరు, గజ్జెల వడ్డాణం, దండ వంకీలు, గాజులు, రాళ్ళ సిగబిళ్ళ... కళ్ళు జిగేల్ మన్నాయి ముసలమ్మకి. క్షణంపాటు చేష్టలుడిగి నిలబడింది. వెంటనే తేరుకుంది. అన్నయ్య చేతిలో నగలపెట్టెను గబుక్కునలాక్కుంది.

"నీ బామ్మర్ది సొంతాన్నటూ లెట్టుకుంటాడని కాదటయ్యా ఆ డబ్బుకోసం అంతలొక్కంతన్నాం. నగలాడేం జేసుకుంటాడు. మీ అమ్మ నగలు మీ చెల్లెకియ్యడం పెద్ద మేరుబ్బానీ అనుకుంటుండావా?"

అన్నయ్య మాట్లాడలేదు. నేను టాక్సీ దిగి గుమ్మాలెక్కుతూ ఆగిపోయాను.

"గుమ్మంలో కొచ్చిన పుత్రీ పడుచు నెల్లగొట్ట కూడదని గడపతొక్క నిత్తుండా నీ చెల్లాయిని. నువ్వా పాతికవే లిచ్చినాడే ఆళ్ళు ఆలుమగలుగా కాపరం చేసేది. గుర్తుంచుకో."

అన్న య్యేదో సర్ది చెప్పబోయేడు. కళ్ళతోనే వారించాను.—'అన్నీ గొడవలు అవే సర్దుకుంటాయిలే' అన్నట్లుగా.

"ఇదిగో ... ఎవుంల్లా ... రంగీ! ఆరత ట్రాండి కోడలికి ... ఇదిగో అమ్మాయీ! నీ నగలు నీ దగ్గరే పెట్టుకుని పడమటేపు గదిలో పడుకో ... మీ అన్నయ్య డబ్బిచ్చేక పందిర మంచం గదిలో పడుకుందువు గాని ..."

"మరి నే వస్తా నత్తయ్యగారూ!" అన్నయ్య అరుగు దిగాడు.

"కుసింత కాఫీ తాగెల్లబ్బాయీ!" ఏ కళనుందో మర్యాదగానే మాట్లాడింది.

"అబ్బె మా ఇంటి ఆనవాయితీ ప్రకారం మేనల్లుడు పుడితేనే కాని, చెల్లాయింట్లో ఏమీ తినం, తాగం ..."

"ఆ ఏర్పాటు నువ్వే తొందరలో చెయ్యాల ... నువ్వా డబ్బు పంపకపోతే నీ చెల్లికి కాపరం లేదు. నీకు మేనల్లుడు ఉండడు." దిగులు మొహంతో వెళ్ళి పోయాడు అన్నయ్య.

హవుస్ సర్జన్సీ పూర్తిచేసి ఉద్యోగం, ప్రాక్టీసు లేకుండా ఖాళీగా ఇంటి పట్టునే ఉన్న నా మొగుడు ఆ సమయంలో ఇంట్లో లేడు.

పనివాళ్ళు చూపించిన బాత్‌రూంలో స్నానంచేసి, పడమటివేపు పడక గదిలో నా బట్టలపెట్టెతోపాటు ప్రవేశించాను. రంగి తెచ్చిన భోజనం కానిచ్చి దేవకన్యలా ముస్తాబయ్యాను. నా వంటిమీద కొట్టొచ్చినట్లు కనిపించే ఎర్రగన్నేరు రంగు జరీచీర కట్టుకున్నాను. ముత్యాల దుద్దులు, ముక్కుపుడక పెట్టుకున్నాను. పొడవాటి ముత్యాలహారం మెడచుట్టూ ఒక పేట తిప్పి రెండో పేట నాభిదాకా వేళ్ళాడేలా వేసుకున్నాను. నల్లతాచులాంటి నా వదులుజడ

## బావిలోని నీటి తగాదా

**ఒకతడు** తన భూమిలో నున్న బావిని పక్క భూమిలోని రైతుకు అమ్మేశాడు. కానీ, బావిని కొన్న రైతు అందులో నుండి నీళ్ళు తోడుకోవడానికి ప్రయత్నించగానే అర్థం పర్థం లేని తగాదా ఒకటి లేవదీశాడు. "నేను నీకు బావిని అమ్మానే కాని, అందులోని నీటిని కాదు. నీరు కావాలంటే అందుకు వేరే డబ్బు చెల్లించాలి" అన్నాడు.

వారిద్దరి మధ్యా ఈ తగాదా పరిష్కారం కాక ఒక న్యాయాధికారి వద్దకు వెళ్ళారు. ఇరుపక్షాలు చెప్పిన వాదాలను అతడు జాగ్రత్తగా విని, విక్రయ దారుతో ఇలా అన్నాడు న్యాయాధికారి: "బావిని మాత్రమే అమ్మి అందులోని నీరు అమ్మలేదని నీ వాదం. బాగుంది. కానీ, బావిని మాత్రమే అమ్మిన వాడివి అందులో నీ నీరు ఎలా ఉంచావ్? ఆ అపరాధానికి నీకు జరిమానా విధించాల్సి ఉంది. బావిలో ఒక్క చుక్క నీరు లేకుండా తోడి తీయ్! లేదా బావి కొన్న ఆసామీకి నువ్వా బావిలో నీటిని ఉంచినందుకు ఇంత అద్దె చెల్లించు" అని తీర్పు చెప్పాడు.

విపరీతమైన ఈ తీర్పుకు తట్టుకోలేక, బావిని విక్రయించిన పెద్దమనిషి క్రయదారుతో కోర్టు వెలుపలే సమాధాన పడ్డాడని వేరే చెప్పనక్కర లేదు

— ప్రసీల్

ముందుకు వేసుకుని అద్దంలో చూసుకున్నాను. నా అందం నన్నే మోహ పరవశురాల్ని చేసింది. ఇక అతగాడు వశం తప్పకుండా ఉంటాడా?

బాగా పొద్దుపోయాక అతను ఇంటికొచ్చిన సవ్వడి వినిపించింది. ముసలమ్మ నేను తెచ్చిన సారె సామానులు కొడుక్కి చూపిస్తూ చెప్పిన మాటలు స్పష్టంగా నా చెవిన పడ్డాయి.

"నీ బావమ్మర్ది నీ పెళ్ళాన్ని తెచ్చి దింపి పోయ్యాడబ్బాయ్? అల్లమ్మదంట— ఇన్నూరు కాసులు నగకట్టున్ను, ఎండికంచం, మరచెంబు అయ్య పట్టుకొచ్చేడు. పాతికవేలు తర్వాతంపుతానన్నాడు. ఇదిగో నీ పెళ్ళాం పడమటేపు గదిలో ఉంది. మ వ్వటేపు పోమాక. నువ్వుగా విప్పుడు కక్కుర్తిపడ్డావంటే మనడబ్బింక రాదు ... కుసింత బిగువ్‌గా మండేం ...."

విని నవ్వుకున్నాను. అత నేం ఋషీశ్వరుడా బిగువుగా ఉండటానికి?ముసలిది నిద్రపోగానే పడమటి గదివేపు పరుగు పరుగున వచ్చేస్తాడు. సిగ్గుతో తలొంచుకుని బెదురుతూ నిలబడిన నా నడుం చుట్టూ చెయ్యి పోనిచ్చి గడ్డం పట్టుకుని నా ముఖం తన వేపుకి తిప్పుకుని—"కొంతకాలం వోర్చుకో, శారదా!"అంటూ నా కెంపుల చెంపలని తన పెదాలతో స్పృశిస్తాడు. నే నతని కౌగిట్లో కరిగిపోతాను...

మత్తుగొలిపే వూహలతో అతని రాకకు ఆశగా ఎదురుచూస్తూ క్షణాలు లెక్కపెడుతూ కూర్చున్నాను.

నా ఆశ నమ్మకాలేదు. అర్ధరాత్రి దాటాక అత నొచ్చాడు. రాగానే నా కేసి అదోలా చూశాడు. వెంటనే లైటార్పేశాడు. అంతే ... ఇక విట్టూర్పులూ లేవు. సిగ్గుపడటాలూ లేవు. సాంత్వన వచనాలూ లేవు. నన్ను తన రెండు చేతుల్లోనూ బంధించేశాడు. వూపిరి సలపనంత గట్టిగా.

ఇలా కొంతకాలం సాగింది. పగలంతా నా గదిలో విూనమేషాలు లెక్కబెడుతూ కూర్చోడం, రాత్రి అతనికి నా శరీరం అప్పగించడం. కొన్నాళ్ళపాటు అసలు నా గది గడపదాటి అసలు సావడిలోకే రాలేదు నేను. ఏం వస్తాను. కనిపిస్తేచాలు...నన్ను, నా అన్ననీ పుట్టు పుర్వోత్తరా లెత్తి దుమ్మెత్తి పోసేది నా అత్త.

ఎంత ద్వేషించినా, నా అవసరం ఒకసారి వచ్చింది ముసలమ్మకి. ప్రొద్దుటే గేదెల పాలు పిండే ముసలయ్య రాలే దొక రోజున. మొహం కడగ్గానే చెంబుడు కాఫీ తాగితేనే కాని,నరాలు పట్లు తప్పిపోతా యావిడకి. నిప్పు తొక్కిన కోతిలాగా గంతులేస్తూంది.

"పోనీ నేను పాలు పిండనా ..." స్నానంచేసి నా గది వేపు నడుస్తూ అన్నాను, ఆవిడ అవస్థ చూడలేక.

"నీకు చేతవునా!"

"ఆహా! నేనూ రైతు బిడ్డనే!"

పాలు పిండాను.

ఆ రోజు నుంచి నాపరిధి పెరిగింది. ముసలయ్యని పూర్తిగా పొలం పనులకి నియోగించిం దావిడ. వేళ పట్టున దూడలకి నీళ్ళు గడ్డి చూడటం, పాలు పిండటం, చల్ల చిలికి వెన్న తియ్యడం నా కప్పగించింది.

రెండు మూడు నెలలు గడిచాయి.

ఒకనాటి సాయంత్రం. భోరున వాన కురుస్తూంది. నా గదిలో నిశ్శబ్దంగా కూర్చునీ ఉన్న నా గుండెలో అంతకంటె కుంభవృష్టి కురిపిస్తూంది. ఎన్నో నవలలు చదివి, సినిమాలు చూసి పెళ్ళి—సంసారం గురించి నేను కన్న కలలన్నీ కల్లలయ్యాయి. నా వూహల్లోని నా బంగారు జీవితం చిన్నాభిన్నమయింది. నన్ను నేనే వూరడించుకుని కళ్ళు మడుచుకున్నాను. వాన వెలిసింది. చినుకుల శబ్దం తగ్గి సావడిలో కూర్చున్న తల్లీ, కొడుకుల సంభాషణ వినిపించింది.

"మా బావమ్మర్ది ఐపి పెట్టేసే డంటే, అమ్మా!"

"అయిసీ యేవిట్రా?"

"అదే! ఇన్‌సాల్వెన్సు పిటిషన్. అప్పు లెక్కువయిపోతే ఇక తీర్చలేనప్పుడు నా యాస్తి అమ్మేసి నా యప్పులు మీరే తీర్చండని గవర్నమెంటుకి దరఖాస్తు పెట్టుకోవడం." వివరించాడు తల్లికి సంగతి.

"అయితే గవుర్మెంటు ఆళ్ళఅప్పులన్నీ తీర్చుద్దా?"

"తీర్చుద్ది!"

"మనంకూడా మన కట్నం బకాయి పాతిక వేలిప్పించమని..."

"చ్చ్! అయ్యేం కుదరవు. నోటు బాకీలయితే అంతో ఇంతో వసూలవుద్ది కాని, పైగా కట్నం పుచ్చుకున్నామని బయటిపడితే విన్న,






నన్నూ జెయిల్లో తోసుద్ది గవర్నమెంటు.''

పూర్వీకుల పరువు కాపాడాలని శరీరంలోని ప్రతి రక్త కణం వెచ్చిస్తున్న మా అన్నయ్య ఐ. పి. పెట్టాడన్న మాట గుండె పిండించేస్తున్నా, ఈ తల్లీ—కొడుకుల రియాక్షన్ తెలుసుకుందామని జాగ్రత్తగా విన్నాను.

''మరి మన పాతిక వేలు!''

''ఇంతే సంగతులు!''

''నేరకపోయి ఒప్పుకున్నాం. ముదనష్టపు సమ్మంధం. ఆ బందరోళ్ళు లచ్చిచ్చే వోళ్ళు. పదుంకున్న అమ్మాయి కావాలని పేచీ పెట్టావు.''

ఎంత మాట పడితే అంత మాట ఎవర్ని పడితే వాళ్ళని అనెయ్యగల దావిడ.

''పోనీ దీనికి ఇడాకు లిచ్చేసి బందరు సమ్మందం సెటల్జేసుకుందామంట్రా. లచ్చ రూపాయలు—ఒక్కతే పిల్లంటరా! బూసులు, బిగినెస్సు...'' గుటకలు మింగింది మా అత్త.

ఇడాకు అంత తేలిక కాదే. ఒకేళ అయినా డెబ్బయి వేలు చేసే బంగారం, వెండి దక్కకుండా పోతాయి కదా.''

కొంచెం సేపిద్దరూ మవునంగా ఉండిపోయారు.

''సర్లే. గోదారి పూటుగా ఉందేమో తెలుసుకో! తంపటేసేద్దాం.''

''తంపటా?''

''అవున్రా! ఏడాది కోపాలన్నా తంపట సరుకులు చుట్టాలకి పంపద్దా!''

నా గుండె గుభిల్లుమంది. తంపట అన్న మాట నా చెవుల కెందుకో పిడుగుపాటులా వినిపించింది. వ్యవసాయ దార్ల కులంలో పుట్టిన నాకు 'తంపట' అంటే ఏమిటో తెలియక పోలేదు. తేగలు, చిలగడ దుంపలు, వేరుశనగకాయలు పెద్ద పెద్ద కడవల్లో వేసి నీళ్ళు పోసి, ఉప్పు వేసి పైన ఎండు చితుకులు చివుకు తాటాకులు పేర్చి మంట పెడితే అవి పదునుగా ఉడికి తినడానికి బాగుంటాయి.

కాని, ఈ రోజుల్లో తంపట వేసే వస్తువు లేముంటాయి? ఇది శ్రావణ మాసం. తేగలు, బుర్ర గుంజు సుబ్బారాయుడి షష్ఠికి కదా తవ్వుతాం!

మరేమిటి తంపటేస్తారువీళ్ళు! ఎంతఆలోచించినా అన్నయ్య ఐ.పి. కి, లక్ష కట్నమిచ్చే బందరు సంబంధానికీ, మా అత్త నా మొగుడు ఎగుమతి చెయ్యబోతే తంపట సరుకు కీ ఏం లింకు ఉందో తెలియ లేదు.

ఈ లోపులో అతగాడు నా గదిలో ప్రవేశించి, అవసరం తీర్చుకుని వెళ్ళిపోయాడు. నా కిక నిద్ర పట్టలేదు. లేచి కిటికీ దగ్గర నిలబడి శూన్యంలోకి చూస్తూ చాలా సేపు గడిపాను. చిట్టచివరికి తెల్లవారు జామున జ్ఞానోదయం అయింది. ఆ తల్లీ కొడుకుల కోడ్ లాంగ్వేజికి అర్థం స్ఫురించి అదిరి పడ్డాను.

మై గాడ్! తంపట అంటే మనిషిని నిలువునా సజీవ దహనం చెయ్యడమా! ముష్టి రూపాయలు. ఈ వేళ గడిస్తే రేపు పోగొట్టుకునే డబ్బు కోసం...నన్ను, నా కడుపులో ఉన్న బిడ్డనీ కాల్చేస్తారా!

ఒహ్! ఈ అన్యాయం అడ్డుకోవాలి.

అసలు తంపటేమిటో తెలుసుకోవాలి.

''వీరన్నా! పెద్దమ్మ గారేదో తంపటేస్తా మంటున్నారు.'' పాలు తీసే ముందు గేదె పొదుగు నీళ్ళతో కడుగుతూ, దూడను లాగుతున్న వీరన్నను అడిగాను.

''అవునమ్మా! పొలాన్నుంచి ఎండు చిదుకులు చివుకు తాటాకులు తోలుకు రమ్మన్నారు.''

''సరేగాని. తంపటేసే టందుకు శ్రావణంలో తేగ లెక్కణ్ణుంచొస్తాయి.'' పరిశీలనగా వీరన్న కేసి చూశాను. కొన్నిక్షణాం పాటు అతనేం మాట్లాడ లేదు. ఉన్నట్టుండి అడిచేడు.


''అమ్మా... చిన్నమ్మగోరూ!''

''ఏమిటి, వీరన్నా?''

''తమరు యెంటనే తమరి అన్నగోరింటి కెళ్ళి పొండి, తల్లీ నా మాటినండి.'' ఆయాసపడుతూ గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

''మీకు తెల్దమ్మా! ఈ నోగిట్లో తంపటనే మాటకి వేరే అర్థం ఉన్నాది. నాకూ సరింగా తెల్దనుకోండి. సలబయ్యేళ్ళ నాటి మాట. నాకు పదేళ్ళుంటాయి. పెద్దమ్మగోరి ఆడబిడ్డ పద మూడో ఏట ముండమోసింట్లో నున్నాది. ఆయమ్మ గోరి అత్తింటినుంచొచ్చిన మనువరితి బంగారం, డబ్బు పెట్టి యాపారం జేసి మీ మాంగారు పెద్దోడయ్యేడనుకోండి! అది వేరే సంగతి. ఆయమ్మ వయసులో నున్నాది. ఉప్పు కారం తినే శరీరం గందా... మా కులపోళ్ళ కుర్రోడు రాములు గోడితో గడ్డి కరచినాది. కడు పొచ్చింది. ఇంట్లో అందరికీ తెలిసి పోనాది. ఆళ్ళిద్దరినీ కుళ్ళబొడి చేసినాడు పెద్దయ్య! అంటే మీ మాం గారి తండ్రి! కడుపు తీయించేత్తామంటే ససేమిరా ఒప్పుకోలే దాయమ్మ.

''మీకెవరికీ కనపడనంత దూర మెల్లి పోతాం, మమ్మల్నొగ్గియుండ నేడిచినాది. నాబం నేక పోనాది. ఆ రోజు పగలంతా కాళ్ళు చేతులు ఇరగ్గొట్టి గదిలో పడేసే రా యమ్మని. ఆ రేత్తిరి దొడ్లో తేగలు తంపటేసినారు. శవం బూడిదయిపోకుం




ఎర్రగా కాలనిచ్చి పెద్ద పెద్ద పణుగురాళ్ళతో పాటు గోని బస్తాలో కట్టేసినారు. గోదాట్లో తోచేసి నారు. వూళ్ళో వాళ్ళకి పట్నాలింటి కెళ్ళి వాదని చేప్పినారు. కొన్నాళ్ళు పోయేక అక్కడ కలరా వచ్చి సచ్చిపోనాదని చెప్పి దినం జేసేసినారు. రాములుగోడు పిచ్చెక్కిపోయి ఎటోపోనాడు.''

భయంతో వూపిరి బిగపట్టి విన్నాను, వీరన్న చెప్పిన కథ.

''అందుగ్గాబట్టి, అమ్మా! తను రెల్లిపొండి. రెండో కంటోడికి తెలియకంట తను ర్నీ రేత్తిరికే రేవు దాటించేస్తాను. తమరి పుట్టింటి నించి ఇట్నం సరిగా ముట్టనేదని ముసలమ్మ కుతకుత నాడి పోతంది! ఏ సెణంలో తమర్నేం చేసుద్దో! బతికుంటే బలుసాకు తిందువులే... నా బిడ్డ లాంటి దానివి.'' పై పంచతో కన్నీళ్ళొత్తుకున్నాడు వీరన్న.

ఆ రోజంతా నా మొగుడు, నా అత్త నుంతనా లాడటం పరిశీలించాను. బహుశా తంపట ఏర్పాట్లు చేస్తున్నారేమో. అయితే ఆ రోజు ముంచుకొచ్చే ప్రమాదం లేదు. వీరన్న పొలాలన్నుంచి చిదుకులు తేవాలిగా! ఈ లోపున నేను ఉడాయిస్తాను.

జలమయమయిన లంక ప్రదేశంలో ఉన్న ఆ వూరి నుంచి ఎటు వెళ్ళాలన్నా, గోదారి దాటాలి! వూళ్ళో కంటా కారు రావాలంటే పదిమైళ్ళు చుట్టూ తిరిగి ఆక్విడెక్టు' మీద నుంచి రావాల్సిందే. మా అత్తారిల్లు మరీ వూరికి చివర ఉంది. చుట్టుపక్కలంతా పిల్లకాలవలు, కొబ్బరితోటలు తప్ప మరి ఇళ్ళు లేవు.

రాత్రి నేను గోదావరిదాటడానికి తను చేసినఏర్పాట్లు రంగి ద్వారా తెలియజేశాడు వీరన్న.

నే నారోజు చాలా తెలివిగా ప్రవర్తించాను. రాత్రి కాగానే నా కోసం ఆతగా డెలాగూ నా గదికి వస్తాడు. అప్పటికే నేను పారిపోతే వెంటనే వెదకడం, నేను దొరికి పోవడం జరుగుతుంది. ఆఖరిసారిగా ఆతని

తృష్ణ చల్లార్చి, మరీ బయలేర్దాను. ఎయిర్‌బాగ్‌లో నా నగలు, వెండి సామాన్లు పడేసి భుజాన వేలా డేసుకున్నాను. బిత్తరి చూపులు చూస్తూ దొడ్డి గుమ్మం దాటాను.

రంగి నా కోసం అక్కడ నిలబడి ఉంది నా చెయ్యి దొరక పుచ్చుకుని కొబ్బరితోట గట్లమ్మట బడి పరుగెట్టింది.

సముద్రం చేరువలో నున్న గోదారిమాంచి పోటు మీదుంది. ఉవ్వెత్తున లేచి పడుతున్న కెరటాలు పడవని వూపేస్తుంటే అతి కష్టంమీద తెల్లారగట్ల నాలుగింటికి అవతలి ఒడ్డుకు చేర్చాడు వీరన్న. ఫస్టు బస్సు హారన్ విన్పించింది. బతుకు జీవుడా అని బస్సులో కూర్చుని, కింద నిలబడిన రంగికీ వీరన్నకీ, చేతులెత్తి నమస్కరించాను. అప్పటికి నేను చేయగలిగింది అంతే!

• • •

"తొందర పడ్డావేమో" అన్నాడు అన్నయ్య.

"మంచి పని చేసే" వంది వదిన. తర్జన భర్జనల తరవాత నలుగురం కూర్చుని నా ఫ్యూచర్ ప్లాను వేశం. నాతోపాటు నా కడుపులో పెరుగుతున్న పాప సంగతి కూడా ఆలోచించాలిగా, కోర్టు కెక్కడం అన్నయ్య, తమ్ముడు కూడా ఇష్టపడలేదు కాని, వదిన సపోర్టు నాకుంది. న్యాయం నావైపుంది. భగవంతుడు నా వైపు ఉన్నాడు.

గర్భవతినైన నన్ను తిండీ తిప్పలు పెట్టకుండా నానా యాతనలు పెడుతున్నారనీ, కట్నం తేలేదని నన్ను ప్రతి పూట హింసిస్తున్నారనీ, చివరికి తల్లీ కొడుకు కలిసి నన్ను సజీవ దహనం చేసెయ్యడానికి సిద్ధపడుతుంటే తప్పించుకుని బయటపడ్డాననీ, ఇక అతగాడితో బ్రతకటం కష్టం కాబట్టి జుడిషియల్ సెపరేషన్ కోరుతూ, నేను బతకడానికి మనోవర్తి, నా బిడ్డ భవిష్యత్తుకి ఆధారం కల్పించమని కోరుతూ కోర్టుని ఆశ్రయించాను.


రంగి, వీరన్న, ఇంకా మిగిలిన పనివాళ్ళంతా నా తరపునే సాక్ష్యం ఇచ్చారు. మా అత్త నా చేత మా అన్నయ్యకి రాయించిన బాధల ఉత్తరాలు కూడా కేసును నెగ్గడానికి ఉపకరించాయి. ఆర్నెల్లలో నాకు కొడుకు పుట్టాడు. నెలకి నాలుగొందల రూపాయలు నా పోషణకోసం పంపించమని అతన్ని ఆదేశిస్తూ, అతగాడి పిత్రార్జితంలో సగం వాటా నా కొడుక్కి భుక్తం చేసి మైనరు తరపున గార్డియన్ నన్ను నియమించింది కోర్టు.

తర్వాత అన్నయ్య తన పొలాలన్నీ అమ్మి అప్పులు తీర్చేసి, మిగిలిన డబ్బుతో విశాఖపట్నంలో వ్యాపారం ప్రారంభించాడు. మేమంతా విశాఖ వెళ్ళిపోయాం.

వదిన ప్రోత్సాహంతో నేను ఎమ్.బి.బి.ఎస్. ఎంట్రెన్స్ రాశాను.-సీటొచ్చింది. చదువు నిర్విఘ్నంగా పూర్తయింది.

ఇప్పుడు నేను ఈ ప్రాంతంలో పెద్ద పేరున్న గైనకాలజిస్టుని. మా అత్తవారి వూళ్ళోనే, నా మొగుడుగారి డిస్పెన్సరీ కెదురుగానే నా లేడీ హోప్ నర్సింగ్ హోమ్.

వ్యతస్సిద్ధమైన మంచితనం ఉంది నాలో!



ఫోటో: మహేశ్వర దాస్

దానికి తోడు అతగాడి మీద కసి— అతని దెబ్బ తియ్యాలని ఆడ—మగ, పిల్లా, పెద్ద అందరికీ, అన్ని రకాల రోగులకీ అతి తక్కువ ఫీజుతో వైద్యం చేస్తూ ప్రాక్టీసు పడగొట్టాను.

ఒక గవర్నమెంటు డాక్టరు నిర్వహించిన వాసక్టమీ అండ్ ట్యూబెక్టమీ శిబిరాల్లో యథాశక్తి సేవ చేశాను. తెల్సున్న ఐ స్పెషలిస్టులని కాంటాక్టు చేసి మా వూళ్ళో 'ఫ్రీ ఐ కాంప్స్' నిర్వహించాను, లయన్సు క్లబ్బు సహాయంతో.

బాబు ఆరోతరగతిలో కొచ్చాడు. డాక్టరు విజయ మోహనప్రసాదుగారు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాడు.

అతగాడికి నాతో సంధి చేసుకోవాలనుంది కాబోలు అప్పడాలు వేయిస్తూండగా చీర కుచ్చిళ్ళంటుకుని పొత్తి కడుపు, తొడలు కాల్చుకున్న అతని రెండవ భార్యని నా నర్సింగ్ హోమ్ కి తీసుకొచ్చాడు. ప్రమాదం లేదు. పొత్తి కడుపు బాగా కాలింది. సంతానం కలగకపోవచ్చు. సంసారానికేం బాధుండదు.

"ఏం డాక్టర్‌గారూ! తంపట వేసే ప్రయత్నం చేశారా!" వెక్కిరింపుగా అన్నాను. ఆమెకి ఇంజెక్టు నిస్తూ.

"చచ్చిన పామునింకా చంపడం దేనికి, శారదా!" అన్నాడు. అలవాటు ప్రకారం స్కూలునించి రాగానే నన్ను వెదుక్కుంటూ డిస్పెన్సరీలో కొచ్చిన బాబుని దగ్గరగా తీసుకుని పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని భవిస్తూ. . .

"వారు నన్ను ప్రేమగానే చూస్తున్నారక్కయ్యా" అంది కమల. నీరసంగా నూతిలోనించి మాట్లాడినట్టున్నా యామె మాటలు.

చూడడూ మరీ. నా తడాఖాకి పదేళ్ళపాటు అతనికి పిల్లనిస్తామంటూ ఎవరూ రాలేదు. అతి కష్టం మీద దొరికిన పెళ్ళాన్ని గాజు కాయలాగ చూసుకుంటున్నాడు కాబోలు.

"ఆదే ఎనిమల్ లవ్ మేకింగా. ఏమైనా మారారా". . .ఇంకా వెటకారంగా అన్నాను.

"శారూ" ఆల్మోస్టు వీకింగ్ స్టేజి కొచ్చేశాడు మానవుడు. మనిషి బుద్ధి మహా చెడ్డది—ఏడ్చేవాళ్ళని ఇంకా ఇంకా ఏడ్పించేలా చేస్తుంది.

"డాక్టరు విజయ మోహన ప్రసాదు గారూ! ప్రాక్టీసు పెద్దగా లేనట్లుంది నా నర్సింగ్ హోమ్‌లో మేల్ డాక్టర్‌గా ఉండకూడదూ మీరు నెలకి సంపాదించేదానికంటే ఎక్కువే ముట్టజెప్తాను". .

"శారూ. . .శారూ. . .శారూ నీకు జరిగిన అన్యాయానికి నన్ను భగవంతుడు బాగానే శిక్షించాడు. గతం వదిలేయ్. నన్ను స్వీకరించు. బాబూ నన్ను 'నాన్న' అని పిలు"—ఏమనుకున్నాడో మురళి తండ్రి గుండెకి అతుక్కుని పోయాడు.

ఇప్పు డందరమూ నా ఇంట్లోనే ఉంటున్నాం. కమల మంచిది, నా చెల్లాయి లేని లోటు తీర్చింది. బాబు పిన్ని దగ్గర ఎన్నో తెలుగు పద్యాలు నేర్చుకుంటున్నాడు.

ఇంక నా మొగుడుగారు. . . నన్నేలుకోడం, కాదు. నేనే అయన్నేలుకుంటున్నాను నా అసిస్టెంటుగా నెల కింత జీత మిస్తూ. . అతను పోగొట్టుకున్న ప్రేమాభిమానాలు తిరిగి అందిస్తూ. .తను మాత్రం విధేయుడై. . .బాస్‌ని అసిస్టెంటు చూసినట్లే. . మరి తడాఖా ఏమిటి!

'లేడీస్ నాట్ ఫర్ బర్నింగ్. . .' *